తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## శ్రీవారి సేవలో విశ్వవల్లభతీర్థస్వామి తీర్థస్వామి

తిరుమల, జూన్ 12ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం ఉదయం ఉడిపి మఠంపీఠాధిపతి విశ్వవల్లభ తీర్థస్వామిశిష్యులతో కలసి దర్శించుకున్నారు. టిటిడి ఇన్‌ఛార్జి ఇఓ వీరబ్రహ్మం, ఆలయ అర్చకులు ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికి దర్శనం చేయించారు.

## సిఎం హోదాలో తిరుమలలో చంద్రబాబు

### -నేటి ఉదయం వెంకన్న దర్శనం





తిరుమల, జూన్ 12ప్రభాతవార్తప్రతినిధి:
ముఖ్యమంత్రిగా నాల్గవసారి ప్రమాణస్వీకారం చేసిన నారాచంద్రబాబునాయుడు తన ఇష్టదైవమ్ వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకోవడానికి బుధవారం రాత్రి 9గంటలకు తిరుమలకు చేరుకున్నారు. మంత్రి నారాలోకేశ్ కుటుంబం కూడా రావడంతో తిరుమలలోని గాయత్రినిలయం అతిథి గృహం వద్ద టిటిడి ఇన్‌ఛార్జి ఇఓ వీరబ్రహ్మం, డిప్యూటీ ఇఓ హరీంద్రనాథ్ పుష్పగుచ్చాలం దించి స్వాగతం పలికారు. చంద్రబాబువెంట సతీమణి నారా భువనేశ్వరి, కుటుంబసభ్యులు ఉన్నారు.

# ఉభయ జిల్లాలకు దక్కని మంత్రి పదవులు!



**రాష్ట్ర మంత్రి వర్గం ఏర్పాటులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు జిల్లాల ఎమ్మెల్యేలకు ఝలక్ ఇచ్చారు. బుధవారం ఆయన ఏర్పాటు చేసిన మంత్రి కూర్పులో చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన కూటమి ఎమ్మెల్యేలకు స్థానం కల్పించలేదు. చిత్తూరు జిల్లా నుంచి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబునాయుడు జిల్లాలోనే ఇతర ఏ ఎమ్మెల్యేకి మంత్రి వర్గం స్థానం కల్పించలేదు.**

చిత్తూరు, తిరుపతి జూన్ 12 ప్రభాతవార్త
చిత్తూరుజిల్లాలో 7గురు ఎమ్మెల్యేలుండగా 6మంది ఎమ్మెల్యేలు తేదేపా తరపున ఎన్నికయ్యారు. ఇందులో కుప్పం నుంచి ఎన్నికయిన నారా చంద్రబాబు నాయుడు సిఎంగా బాధ్యతలు చేపట్టారు. మిగిలిన 5గురిలో ఒకరికైనా సిఎం చంద్రబాబు నాయుడు మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తారని భావించారు. చిత్తూరు జిల్లా నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నూతనకాల్వ అమరనాథరెడ్డి, కమ్మ సామాజిక వర్గానికి చెందిన గాలి భాను ప్రకాష్‌నాయుడు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ థామస్, డాక్టర్ మురళీ మోహన్‌లకు మంత్రి వర్గంలో పలమనేరు ఎమ్మెల్యే నూతనకాల్వ అమరనాథరెడ్డికి తప్పకుండా స్థానం లభిస్తుందని అందరూ భావించారు. అలాగే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గంగాధర నెల్లూరూ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అవకాశముంటుందని అనుకొన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టారు. అదే సామాజిక వర్గానికి చెందిన జిల్లాలోని ఇద్దరు కమ్మ సామాజికి వర్గానికి మంత్రి వర్గంలో చోటు లభించక పోవచ్చునని పరిశీలకులు భావించారు. అయితే సిఎం చంద్రబాబు నాయుడు ఏ ఒక్కరికీ అవకాశం కల్పించకుండా మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసారు. అదే విధంగా తిరుపతి జిల్లా నుంచి జనసేన తరపున తిరుపి ఎమ్మెల్యేగా ఎన్నికయిన ఆరణి శ్రీనివాసులు మంత్రి వర్గంలో స్థానం దక్కుతుందని ఆశలు పెట్టుకొన్నారు. అయితే తిరుపతి జిల్లా నుంచి తేదేపా ఎమ్మెల్యేలతోపాటు మిత్రపక్షమైన జనసేన ఆరణికి సైతం మంత్రి వర్గంలో అవకాశం లభించలేదు. అలాగే తిరుపతి జిల్లా సర్వేపల్లి నుంచి తేదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి మంత్రి వర్గంలో చోటు లభించలేదు. గత తేదేపా ప్రభుత్వంలో సోమిరెడ్డి ఎమ్మెల్యేగా ఓటమి చవి చూసినా ఆయన్ను ఎమ్మెల్సీ ని చేసి అప్పటి సిఎం చంద్రబాబు నాయుడు మంత్రి వర్గంలోకి తీసుకొన్నారు. అయితే వైకాపా ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన కాకానిపై సోమిరెడ్డి గెలుపొందినా మంత్రివర్గంలో మొండి చెయ్యి చూపారని పరిశీలకులు అంటున్నారు. ఎన్నికల్లో చిత్తూరు, తిరపతి జిల్లాల నుంచి తేదేపా తరపున అత్యధిక ఎమ్మెల్యేలు విజయం సాధించి నప్పటికీ మంత్రి వర్గంలో రెండు జిల్లాల నుంచి ఎమ్మెల్యేలకు మంత్రి వర్గంలో స్థానం లభించక పోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. సమీప భవిష్యత్తులో చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి తేదేపా ఎమ్మెల్యేలకు మంత్రి వర్గంలో స్థానం లభిస్తుందాని వేచి చూడాల్సి వుంది.

## నేటి నుండి మోగనున్న బడి గంట

### వేసవి సెలవులు అనంతరం నేడు పున:ప్రారంభం కానున్న పాఠశాలలు



తిరుపతి విద్య, జూన్ 12, ప్రభాతవార్త
వేసవి సెలవులు ముగియడంతో ఇవాల్టీ నుంచి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు తెరుచుకోనున్నాయి. 40 రోజుల పాటు స్కూళ్లన్నీ సమ్మర్ హాలిడేస్‌లో మూతపడ్డాయి. సెలవులు ముగియడంతో నేటి నుంచి విద్యార్థులు స్కూళ్లను క్యూకట్టనున్నారు. ప్రభుత్వ స్కూళ్లల్లో సమస్యలు విద్యార్థులకు స్వాగతం పలకనున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో పెరిగిన ఫీజులతో తల్లిదండ్రులు వామ్మో అనే పరిస్థితి తయారైంది. ప్రైవేటు స్కూలు యజమాన్యాలు ఫీజులను ఏడాదికేడాది అమాంతం పెంచేస్తున్నా నియంత్రించాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తల్లిదండ్రులు లక్షల్లో ఫీజులు చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. అంతేకాదు ప్రైవేటు పాఠశాల్లో పాఠ్యపుస్తకాలు అమ్మొద్దని ప్రభుత్వం హెచ్చరించినా ప్రైవేటు స్కూల్స్ యజమాన్యాలు మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో ప్రైవేటు పాఠశాలల ఫీజులకు తల్లిదండ్రులు బలైపోతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల కోసం ఒకటి నుండి పదవ తరగతి వాళ్ళకి పాఠ్యపుస్తకాలు ఎంఆర్‌సి కార్యాలయం నుంచి మండలాలకు చేరుకున్నాయి. పాఠశాలలు ప్రారంభమైన వెంటనే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా స్టూడెంట్స్ కిడ్స్ అనే పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసేందుకు విద్యా శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటి వరకు పలు మండలాలకు వీటిని పంపిణీ చేశారు. మిగిలిన మండలాలకు రెండు మూడు రోజుల్లో పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పాఠశాలలు పున: ప్రారంభం అయ్యే నాటికి స్టూడెంట్స్ కిడ్స్ అనే పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందించడం వల్ల తరగతులు ప్రారంభం అయ్యే నాటి నుండే విద్యార్థులకు పాఠాలను బోధించే అవకాశం ఉంటుందని అధ్యాపకులు చెబుతున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ విద్యార్థులకు సకాలంలో చేరడం వల్ల సిలబస్ సకాలంలో పూర్తి చేసే అవకాశం ఉంటుందని టీచర్లు చెబుతున్నారు. జిల్లా కార్యాలయం నుండి మండల కార్యాలయాలకు చేరుకున్న స్టూడెంట్స్ కిడ్స్ పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌ను మండల స్థాయి అధికారులు ఆయా పాఠశాలలకు సకాలంలో చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తేనే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుంది.

# సిఎం ప్రమాణ స్వీకారాన్ని వీక్షించిన ప్రజలు

### నాగయ్య కళాక్షేత్రం, గాంధీ సర్కిల్‌లలో భారీ తెరలపై తిలకించిన ప్రజలు

చిత్తూరు, జూన్ 12, ప్రభాతవార్త:
రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం గన్నవరం ఐటి పార్క్ సమీపంలోని కేసరపల్లె సభాప్రాంగణంలో చేసిన ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని చిత్తూరు నగర ప్రజలు జిల్లా అధికార యంత్రాంగం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రం, గాంధీ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన భారీ తెరలపై వీక్షించారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ చిత్తూరు నాగయ్య కళాక్షేత్రం జిల్లా స్థాయి అధికారులు, టిడిపి నేతలు వీక్షించడాని, చిత్తూరు గాంధీ విగ్రహ ప్రాంగణంలో నగర ప్రజలు వీక్షించడానికి మున్సిపల్ కమీషనర్ డా. జే. అరుణ ఆధ్వర్యంలో భారీ తెరలను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రుల ప్రమాణ స్వీకార ఉత్సవాన్ని భారీ తెరలపై ప్రజలు, అభిమానులు ఆశక్తిగా తిలకించారు. తమ అభిమాన నేతలు ముఖ్యంత్రిగా, మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో నేతలు, ప్రజలు, అభిమానులు సందడి చేశారు. నాగయ్య కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణ స్వీకారాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్ , జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, డిఆర్ఓ పుల్లయ్య, జిల్లా అధికారులు, టిడిపి నేతలు, కార్యకర్తలు, మహిళా సంఘాల నేతలు వీక్షించారు.



ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణ స్వీకారం వీక్షిస్తున్న జిల్లా అధికారులు

## కంటైనర్‌ను కారు ఢీకొని ఇద్దరు మృతి



పాకాల, జూన్ 12, ప్రభాతవార్త
పాకాల మండలం పూతలపట్టు - నాయుడుపేట హైవే రోడ్డులోని గాదంకి ఎన్ఏఆర్ఎల్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పాకాల పోలీసులు తెలిపిన వివరాలు మేరకు నేంద్రగుంట సమీపంలోని రాడార్ కేంద్రం వద్ద ముందు వెళ్తున్న కంటైనర్‌ను వెనకనుంచి కారు ఢీకొన్నదని తెలిపారు. కారు డ్రైవింగ్ అతివేగమే ప్రమాదానికి కారణం అన్నారు. ఈ ఘటనలో మృతి చెందిన వారు ఉత్తరప్రదేశ్‌కు చెందిన జ్యోతి గోయల్ (34) అతని భార్య ఆశిష్ గోయల్ (30)గా గుర్తించారు. వారి కుమారుడు సుశాల్ గోయల్ (7)కి తీవ్ర గాయాలు కాగా తిరుపతి రుయా హాస్పిటల్‌కి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరు బెంగళూరు నుంచి తిరుమలకు శ్రీ వారి దర్శనం కోసం వస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ఏనుగుల దాడుల నిరోధానికి చర్యలు

### అనంతపురం రేంజ్ సిసిఎఫ్ నాగేశ్వరరావు



ననియాల క్యాంప్‌లో శిక్షణ ఏనుగులను పరిశీలిస్తున్న సిసిఎఫ్ నాగేశ్వరరావు

కుప్పం, జూన్ 12 ప్రభాతవార్త
కుప్పం ప్రాంతంలో ఏనుగుల దాడుల నిరోధానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు అనంతపురం రేంజ్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. చిత్తూరు డిఎఫ్ఒ చైతన్యకుమార్‌రెడ్డి, పలమనేరు సబ్ డిఎఫ్ఒ వేణుగోపాల్‌తో కలసి ఆయన కుప్పం అటవీ రేంజ్ పరిధిలో రెండు రోజుల పాటు పర్యటించారు. ఈసందర్భంగా రామకుప్పం మండలం ననియాల పరిధిలో జరుగుతున్న అటవీ అభివృద్ధి పనులు పరిశీలించారు. ఏనుగుల క్యాంప్‌లో శిక్షణ పొందిన ఏనుగుల ఆరోగ్యపరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. కుప్పం మండలం శ్రీ బేటరాయస్వామి కొండ ప్రాంతంలో జరుగుతున్న పనులు పరిశీలించారు. అటవీశాఖ వనాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఏనుగుల సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను అధికారులు, సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో జయశంకర్, డిఆర్వోలు కృష్ణప్రసాద్, వైసి రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### సిఎం తిరుపతి జిల్లా పర్యటన నేపథ్యంలో

# బందోబస్తు పక్కాగా నిర్వహణ

### ఎఎస్ఎల్‌లో భాగంగా భద్రత ఏర్పాట్లపై సమీక్ష : కలెక్టర్ , ఎస్పీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పి, అధికారులు

తిరుపతి కార్పొరేషన్, జూన్ 12, ప్రభాతవార్త
ఈ నెల 12, 13న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమల, తిరుపతి పర్యటన నేపథ్యంలో పర్యటనలో చిన్నపాటి లోపాలకు కూడా తావివ్వరాదని అధికారుల సమన్వయ సమావేశంలో తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్పి హర్షవర్ధన్ రాజుతో కలిసి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫిరెన్స్ హాల్ నందు ఏర్పాటు చేసిన ముందస్తు భద్రత లైజన్ అధికారుల సమన్వయ సమావేశంలో ఎస్పితో కలిసి కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం అనంతరం మొట్టమొదటి సారిగా తిరుమల తిరుపతి పర్యటనకు రానున్నారని, బుధవారం రాత్రి 7.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుండి రోడ్డు మార్గాన బయల్దేరి రాత్రి 8.50గంటలకు తిరుమలకు చేరుకుని గాయత్రి నిలయం అతిథి గృహం నందు రాత్రి బస చేయనున్నారని, మరుసటి దినం ఉదయం 7.30 గంటలకు తిరుమల శ్రీవారి దర్శనానంతరం 9 గంటలకు తిరుమల నుండి బయలుదేరి ఉదయం 10 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని విజయవాడకు తిరుగు ప్రయాణం కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ వారు స్పెషలిస్ట్ డాక్టర్లు ఏర్పాటు, సేఫ్ రూమ్ ఏర్పాటు, ఆధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్, ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ, ఎపి ఎస్పిడీసిఎల్ విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని, ఎయిర్ పోర్ట్ నందు విఐపి లాంజ్ తదితరాల ఏర్పాటు, ప్రోటోకాల్ అంశాలలో ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్భందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ తరపున బందోబస్తు పక్కాగా ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండరాదని పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్, ఎస్పి సంబంధిత అధికారులతో కలిసి రేణిగుంట విమానాశ్రయం ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం తిరుమల చేరుకుని జేఈఓ వీరబ్రహ్మ, సివిఎస్వో నరసింహ కిషోర్ తదితరులతో కలిసి ముఖ్యమంత్రి బస చేయనున్న గాయత్రి నిలయం అతిథి గృహాన్ని టెంపుల్ దర్శన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి వెంకట్రావు, కులశేఖర్, విమల కుమారి, శ్రీనివాస రావు, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, జిల్లా అధికారులు, ఎయిర్పోర్ట్ అధికారులఉ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి రాజీనామా

### ఇఓకు పత్రాలు సమర్పణ

### అమెరికా అలంకారాల కోసం జాప్యం చేసాం : అంజూరు

శ్రీకాళహస్తి, జూన్ 12 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ప్రత్యేకాహ్వానితులు మూకుమ్మడిగా బుధవారం రాజీనామా పత్రాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వి నాగేశ్వరరావుకు తన ఛాంబర్‌లో సమర్పించారు. ఈ సందర్భంగా తాజామాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ జగనన్న, మధన్న తమకు రెండు సార్లు ధర్మకర్తల మండలి అవకాశం కల్పించారన్నారు. 29 నెలల పాటు తాము ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇప్పటి వరకు ఏ ధర్మకర్తల మండలికి దక్కని అవకాశం మూడు మహాశివరాత్రులను కంటిన్యూగా నిర్వహించే భాగ్యం దక్కలేదు. అది తమకు దక్కిందన్నారు. ఇది స్వామి అమ్మవార్ల వరం అన్నారు. గత నెల 13న ఎన్నికలు జరిగాయని అలాగే ఈ నెల 4న లెక్కింపు జరిగిందని కానీ తమ ప్రభుత్వం అధికారానికి రాలేదని అయినా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కానీ ఆ పార్టీ తరఫున శాసనసభ్యుడుగా గెలిచిన బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి కానీ, బిజెపి, జనసేన నాయకులు ఎవ్వరూ తమను రాజీమానా చేయమని కోరలేదన్నారు. అయితే తాముకూడా అమెరికా నుంచి ఓ దాత ఇచ్చిన విరాళాన్ని అలంకరించుటకు వారు వస్తారనే నమ్మకంతో వారం రోజుల పాటు రాజీనామ చేయలేదే తప్ప తామేదో చూరుపట్టుకొని వేలాడటానికి కాదన్నారు. తమ పదవి కాలంలో అప్పటి శాసనసభ్యులు బియ్యపు మధుసూధనరెడ్డి ఎన్నో విధాలుగా సహాకరించారన్నారు. తమను అభివృద్ధి పథం వైపు నడపటంలో దిశ దెశ నిర్దేశం చేయటమే కాకుండా అధికారులను అభివృద్ధి పనులకు పరుగులు తీయించారని వివరించారు. తమ 29 నెలల పదవి కాలంలో సహాకరించిన అధికారులు, సిబ్బంది, అర్చకులు, ప్రతి ఒక్క శివసేవకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో అంజూరు తారక శ్రీనివాసులుతో పాటు బుల్లెట్‌శ్యాం, ప్రకాశం పంతులు, పెద్దిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, కొండూరుసునీత, రమాప్రభ, పసల సుమతి, లక్ష్మి, జయమ్మ ప్రత్యేకాహ్వానితులు కంతా ఉదయ్‌కుమార్, అవుల పాటు శ్రీనివాసులు జూలుగంటి సుబ్బారావు, శోభాగౌడ్, సుశీల, రుష్యేంద్రమణి పట్టణ ప్రముఖులు కొండూరు నరసింహాలు, భాస్కర్‌ముదిరాజ్, మెగరాల రమేష్, లక్ష్మీపతి, పత్తిమణి, చింతామణి యాదయ్య, పసల కుమారస్వామి, గిరిప్రసాద్‌గౌడ్, పుట్టంరాజా, ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మకర్తల మండలి రాజీనామా లేఖలను ఇఓకు అందిస్తున్న దృశ్యం

## బాబు,పవన్‌ల సారధ్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

**కాణిపాకం, జూన్ 12 ప్రభాతవార్త:**

బాబు,పవన్‌ల సారధ్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధ్యపడుతుందని జిల్లా జనసేన నాయకులు ఎం.మహేష్‌స్వేరో ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సీఎంగా నారా చంద్రబాబునాయుడు, క్యాబినెట్ మంత్రిగా జనసేనాని పవన్‌కళ్యాణ్‌కు ఇతర మంత్రులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. దేశంలోనే విజయరీ వున్న నాయకుడు చంద్రబాబునాయుడు, ఆంధ్ర రాష్ట్ర ప్రజల కోసం రాష్ట్ర అభివృద్ధికోసం నిరంతరం పరితపించే పవన్ కళ్యాణ్ సారధ్యంతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెంతుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పవన్‌కళ్యాణ్ పోరాట పటిమ, స్ఫూర్తి కోట్లాదిమందికి ఆదర్శం అని మహేష్‌స్వేరో తెలిపారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు సంబరాల శోభ

**పుంగనూరు, జూన్ 12 ప్రభాతవార్త:**




ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేయడంతో పట్టణంలోనిప్రభుత్వకార్యాలయాలు విద్యుత్ కాంతులతో ముస్తాబయి కొత్త కళను సంతరించుకున్నాయి. పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయం,మున్సిపల్ కార్యాలయంతో పాటూ వ్యవసాయ మార్కెట్‌కమిటీ కార్యాలయాలలో ప్రజలు,రైతులు ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారోత్సవాన్ని తిలకించేందుకు ఎల్ఇడి టీవిలు ఏర్పాటుచేశారు.మున్సిపల్ కార్యాలయంలో సమావేశ భవనంలో ఏర్పాటుచేసిన లైవ్ కార్యక్రమాలను తిలకించే కార్యక్రమంలో ప్రజలు,మహిళా సంఘాలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, మండలపరిషత్తు కార్యాలయంలో పరిసర గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు లైవ్ కార్యక్రమాన్ని తిలకించారు. సిఎం ప్రమాణ స్వీకారం సందర్భంగా, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో టమోటా విక్రయానికి వచ్చిన రైతులు ఆనందంతో హర్షాతిరేఖాలు వ్యక్తం చేశారు.

## చంద్రన్న ప్రమాణంతో సదుంలో సంబరాలు

**సదుం, జూన్ 12 ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా సదుం మండలంలో ఆపార్టీ నాయకులు కార్యకర్తలు సంబరాలు జరుపుకొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారాన్ని తిలకించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేసారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండల కేంద్రం సదుంలో ఎన్డీయే కూటమి తేదేపా, జనసేన, బిజెపిలకు చెందిన నేతలు బాణాసంచాలు పేల్చి నినాదాలు చేస్తూ సంబరాలు జరుపుకొన్నారు. తేదేపా నేతలు రెడ్డి ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, నారాయణ, రత్న, నడిగడ్డ వెంకటేష్, భువన్‌కుమార్, సిరన్నగారి పవన్, నడిగడ్డ పవన్‌కుమార్‌రెడ్డి, సునీల్ కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచు అమర్‌నాథ్, వెంకట్రమణారెడ్డి, మారుతిరెడ్డి, రాజారెడ్డి, రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన విజయోత్సవ ర్యాలీ

**పలమనేరు టౌన్,జూన్ 12,ప్రభాతవార్త:**



పలమనేరు పట్టణంలో ఘనంగా జనసేన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.అమరావతిలో జరిగిన ముఖ్యమంత్రి,మంత్రుల ప్రామాణ స్వీకారం సందర్భంగా స్థానిక జనసేన నాయకులు ఘనంగా సంబరాలు చేసుకున్నారు.భారీ సంఖ్యలో యువత ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించి మంత్రి పవన్‌కళ్యన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.జనసేన పార్టీ నుండి ఎమ్మెల్యేలుగా గెలుపొంది మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన వారి కోసం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు,యువత తదితరులు పాల్గొన్నారు.

## ఇపిఎంసెట్‌లో ఐఆర్ఎం విద్యార్థుల ప్రతిభ

**కుప్పం, జూన్ 12 ప్రభాతవార్త**



మంగళవారం విడుదలైన ఇపిఎంసెట్ పరీక్షా ఫలితాల్లో కుప్పం ఐఆర్ఎం కాలేజ్ విద్యార్థులు ర్యాంకుల పంట సాధించినట్లు కాలేజ్ ఛైర్మన్ బిఎం దయానిధి తెలిపారు. జీవన అనే విద్యార్థిని రాష్ట్రస్థాయిలో 643వ ర్యాంకు సాధించిందన్నారు. అలాగే లుబ్నాఖానం 4775ర్యాంకు పొందిందన్నారు. అలాగే తేజశ్రీ రాష్ట్రస్థాయిలో 21899, ఉమేఖాన్23333, విష్ణుప్రియ 24735, కస్తూరి23617, నునిత్‌కుమార్25182 రాంకులు సాధించారన్నారు. మొదటి ప్రయత్నంలోనే తమ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఛైర్మన్ బిఎం దయానిధి, అకడమిక్ డైరెక్టర్ డా॥ మధుసూధన్‌రెడ్డి అభినందించారు.

## రాజీనామా బాటలో ధర్మకర్తల మండలి సభ్యులు

**బోయకొండ(చౌడేపల్లి), జూన్ 12 ప్రభాతవార్త**



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు రాజీనామా బాట పట్టారు. ఇప్పటికే నాగరాజరెడ్డి, రాజేష్‌లు పదవులకు రాజీనామా చేసి వున్నారు. బుధవారం భారతి, హైమావతి, బుడ్డమ్మలు రాజీనామాలు చేసారు. ఈ మేరకు ఇఒ చంద్రమౌళికి పత్రాలందించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా ఓటమి పాలవడంతో పదవులకు రాజీనామా చేస్తున్నట్లు వారు ప్రకటించారు.

## సిఎం ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని తిలకించిన ప్రజలు

**పాకాల, జూన్ 12, ప్రభాతవార్త**



రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు నాలుగవసారి ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని పాకాల ఎంపిడిఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిడిఓ నాగేంద్రబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడి టీవీలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజలు తిలకించారు. విజయవాడ కేసరపల్లిలో ఏర్పాటు చేసిన వేదికపై బుధవారం ఉదయం 11.27 గంటల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారాచంద్రబాబు నాయుడు ప్రమాణాన్ని వీక్షించారు. చంద్రబాబు పదవీ ప్రమాణ మహోత్సవ కార్యక్రమాన్ని మండల ప్రజలు, డ్వాక్రా సంఘం మహిళలు, అధికారులు తిలకించారు.

## గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో గుద్ది చంపి వ్యక్తి మృతి

**పాకాల, జూన్ 12, ప్రభాతవార్త**



పాకాల మండలం బంధార్లపల్లి, దామలచెరువు మధ్యలో గల వెంకట్రాయని చెరువులో గుర్తు తెలియని వ్యక్తిని రాళ్లతో గుద్ది చంపిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. సంఘటన స్థలానికి పాకాల పోలీసులు చేరుకుని పరిశీలిస్తున్నారు. క్లూస్ టీం వచ్చి పరిశీలించి ఆధారాలు సేకరిస్తున్నారు. పాకాల పోలీసులు తెలిపిన వివరాల మేరకు చనిపోయిన వ్యక్తి వయసు సుమారు 25 సంవత్సరాలు ఉంటుందని, మృతుడు నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన యెడల పాకాల పోలీస్ ఎస్ఐ మహేష్ బాబుని సంప్రదించాలని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాకాల ఎస్ఐ మహేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐరాలలో ప్రమాణ స్వీకారోత్సవ సంబరాలు

**ఐరాల, జూన్ 12 ప్రభాతవార్త:**



రాష్ట్రంలో నూతన కూటిమి ప్రభుత్వ ఏర్పాటులో భాగంగా బుధవారం జరిగిన మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవ సంబరాలను మండలంలో టీడీపీ, జనసేన, బిజెపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా మండల కేంద్రం ఐరాలలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ఐరాల బజారు వీధిలో పెద్దఎత్తున బాణా సంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. అలాగే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, కెబినెట్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అలాగే భారీ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ సంబరాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎన్డీఏ కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

***తవణంపల్లెలో...***

రాష్ట్రంలో నూతన ప్రభుత్వ మంత్రివర్గ ప్రమాణ స్వీకారోత్సవ సంబరాలను మండలంలో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిర్వహించారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, కేబినెట్ మంత్రిగా జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో తవణంపల్లె, అరగొండ తదితర ప్రాంతాల్లో ఎద్దఎత్తున బాణా సంచా పేలుస్తూ సంబరాలను చేసుకున్నారు.అలాగే ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమాన్ని తిలకించడానికి మండల కేంద్రం తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరం, గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయాల్లో జిల్లా యంత్రాంగం అదేశాల మేరకు టీవీలు, ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేయడంతో అక్కడ ప్రజలు ప్రమాణ స్వీకారోత్సవాన్ని తిలకించారు. ఈకార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సిఎం ప్రమాణస్వీకారానికి తరలిన వాల్మీకులు

**పుంగనూరు,జూన్ 11 ప్రభాతవార్త**



రాష్ట్రవాల్మీకి సంఘ నాయకుడు కనుమకుంట సుకుమార్‌బాబు నేతృత్వంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారోత్సవానికి నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున వాల్మీకులు మంగళవారం విజయవాడకు తరలివెళ్ళారు. బుధవారం విజయవాడలో జరిగే సిఎం ప్రమాణస్వీకారంలో పాల్గొనడానికి రాష్ట్రవాల్మీకి సంఘ అధ్యక్షుడు సుకుమార్‌బాబుకు ప్రత్యేకంగా ఆహ్వానం అందింది. దీంతో ఆయన నియోజకవర్గంలోని వాల్మీకుల కోసం ప్రత్యేకంగా బస్సుఏర్పాటుచేసి,వారందరికి సౌకర్యాలు కల్పించి విజయవాడకు బయలు దేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వాల్మీకులను ఎస్టీలుగా పరిగణించేందుకు చంద్రబాబునాయుడు,కిరణ్‌కుమార్‌రెడ్డిలు స్పష్టమైన హామీలిచ్చారన్నారు. కార్యక్రమం లో రాష్ట్రవాల్మీకి సంఘ నాయకురాలు కనుమకుంట సులోచనతో పాటూ వందలాది మంది వాల్మీకులు బయలుదేరి వెళ్ళారు.

## మున్సిపాలిటీలో ప్రత్యక్షప్రసార వీక్షణం

**పుంగనూరు, జూన్ 11 ప్రభాతవార్త:**



మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి రాష్ట్ర నూతన సిఎం ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారవీక్షణ ఏర్పాట్లు చేసినట్లు కమీషనర్ నర్సింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. సిఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా మున్సిపల్ కార్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ సమావేశ మందిరంలో జరిగే ఈకార్యక్రమం తిలకించడానికి ప్రజలందిరికీ ఆహ్వానిస్తున్నట్లు వివరించారు.

## నేడు డయల్ యువర్ డిఎం

**పుంగనూరు, జూన్ 11 ప్రభాతవార్త:**

పుంగనూరు ఆర్టీసి డిపో బస్సుల సేవలు,ప్రయాణీకుల అనుభవాలు, సలహాల కోసం బుధవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపోమేనేజర్ సుధాకరయ్య తెలిపారు. పుంగనూరు ఆర్టీసి డిపో సేవలు గురించి తమ సందేహాలను ప్రజలు 9100941850 నెంబరుకు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్యన సంప్రతించాలన్నారు.

## అంబరాన్నంటిన " ప్రమాణ " సంబరాలు

**చౌడేపల్లి, జూన్ 12 ప్రభాతవార్త**



ఎన్డీయే కూటమి తేదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా జనసేనాని పవన్‌కళ్యాణ్‌తోపాటు మరో 23మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండలంలో సంబరాలు ఆకాశాన్నంటాయి. తేదేపా, జనసేన, భాజాపాల ఆధ్వర్యంలో స్థానిక బసాండు నందు కేక్‌కట్ చేసి అందరికీ పంచి పెట్టడంతోపాటు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. బాణాసంచా పేల్చి తమ అభిమానాన్ని చాటుకొన్నారు. మండలంలోని పరిపాలనా భవనం, సచివాలయాల్లో ఎల్ఇడి స్క్రీన్‌లలో నారా చంద్రబాబు నాయుడి ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని వీక్షించారు. తేదేపా, జనసేన, బిజెపి నాయకులు పూల చంద్రమౌళి, జంపాల శ్రీనివాసులు నాయుడు, గడ్డంవారిపల్లి వెంకట్రమణ, నారాయణరాజు, అర్జున్, దొరస్వామిరెడ్డి, వాసుదేవరెడ్డి, కార్తీక్‌కుమార్, పరమేష్, కుమార్‌రెడ్డి, కళ్యాణ్, ఆమినిగుంట శంకర, భాస్కర్‌రెడ్డి, మనోహర్, గందోడి ప్రవీణ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్దకొండామర్రిలో ఘనంగా గంగజాతర

**చౌడేపల్లి, జూన్ 12 ప్రభాతవార్త**



మండలంలోని పంచాయతీ కేంద్రం పెద్దకొండామర్రిలో బుధవారం గంగజాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామ నడిబొడ్డున వున్న గంగమ్మకు విశేషాభిషేకాలు, అలంకరణలు గావించారు. రాత్రంతా మహిళలు అమ్మవారికి పిండిదీపాలతో ఆరాధించారు. జాతర సందర్భంగా గ్రామంలో మిరుమిట్లు గొలిపే దీపాలతో అలంకరించారు. చుట్టుపక్కల వారు తరలిరావడంతో పెద్దకొండామర్రిలో సందడి నెలకొనింది.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కోటలో తెలుగు తమ్ముళ్ల సంబరాలు

**కోట, జూన్ 12 ప్రభాతవార్త**



రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేయడంతో కోట మండలంలోని తెలుగుదేశం పార్టీ శ్రేణులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు వెంకన్నపాలెం గ్రామంలో సర్పంచ్ కూకర్ల మధుయాదవ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మధుయాదవ్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో అసాధారణ విజయం సాధించి నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన దార్శనికుడు, కేంద్రప్రభుత్వంలోను కీలక భూమిక పోషిస్తున్న నేత చంద్రబాబు అని అన్నారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రాన్ని ప్రగతిపథంలోకి తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు విద్యా నగర్‌లో వాకా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. వెంకన్న పాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఉపసర్పంచ్ యనమల శ్రీనివాసులు, ఉడతా శీనయ్య, ఉలసా సుబ్రహ్మణ్యం,మోపూరుకృష్ణయ్య,లింగుంట కార్తీక్, గుర్రం రాము, కోటి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారానికి తరలిన శ్రేణులు

**కోట, జూన్ 12 ప్రభాతవార్త**

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు నాలుగోసారి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు కోట మండలం నుంచి తిరుపతి జిల్లా బిసిసెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు, పలగాటి భాస్కర్‌రెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, జలీల్‌బాషా తదితరులు వివిధ వాహనాల్లో తరలి వెళ్లారు. పలువురు నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో వెళ్లారు.

## ఎల్ఇడి స్క్రీన్ల ద్వారా ప్రమాణ స్వీకారం వీక్షించిన ప్రజలు

**కోట, జూన్ 12 ప్రభాతవార్త**

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం కేసరపల్లి వద్ద ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కోట మండల పరిషత్ కార్యాలయంలో ఎల్ఇడి స్క్రీన్ల ద్వారా ప్రజలు తిలకించేందుకు ఏర్పాట్లు చేశారు. కోట మండలంలోని నాయకులు, అధికారులు, ప్రజలు ప్రమాణ స్వీకారాన్ని వీక్షించారు.

## టిడిపి శ్రేణుల సంబరాలు

**సూళ్లూరుపేట, జూన్ 12 ప్రభాతవార్త**

ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఇందిరానగర్ సెంటర్‌లో బుధవారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. తెలుగుదేశం సీనియర్ నాయకులు దంతాల రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. పెద్దఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు చిట్టేటి పెరుమాళ్ళు, అలవల శ్రీనివాసులు, మేడా సాయినారాయణ, పెంచలయ్య, శ్రీధర్‌నాయుడు, బుజ్జయ్య, ప్రసాద్, కొండలరావు, యుగంధర్,చెంగయ్య,మునస్వామి,వినోద్, బందిలి రాజా, పళణి, మీనా, రాజీ తదితరులు పాల్గొన్నారు.

## బాబు ప్రమాణ స్వీకార వీక్షణకు ఏర్పాట్లు

**తడ, జూన్ 12 ప్రభాతవార్త**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఇతర మంత్రివర్గ సహచరులు ప్రమాణ స్వీకారాన్ని ఆయా మండల కేంద్రాల్లో వీక్షించడానికి ఏర్పాట్లు చేశారు. బుధవారం తడలోను వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ఈ కార్యక్రమాన్ని పెద్దతెరలపై తిలకించారు. 'చంద్రబాబునాయుడు అనే నేను' అనే ప్రమాణ స్వీకారం స్థానిక అధికారులను కూడా సంబరపరిచింది. ఇదిలావుంటే తడ మండలం నుంచి ప్రత్యేక వాహనాలలో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో గుడివాడకు తరలివెళ్లారు.

## చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా సంబరాలు

**చిల్లకూరు, జూన్ 12, ప్రభాతవార్త**



రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా చిల్లకూరు మండల తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లు రెడ్డి ఆధ్వర్యంలో చిల్లకూరు మండల పరిధిలోని వరగలి క్రాస్ రోడ్ సమీపంలో ఎన్డీఏ కూటమి విజయోత్సవ సంబరాలను మండలంలోని నాయకులతో కలిసి టపాసులు పేల్చి, కేకును కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచి పెట్టి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రను నేడు సువర్ణ అక్షరాలతో రాసే సమయమని, వైసిపి ప్రభుత్వం చేసే అరాచకాలతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారని, ఎన్డీఏ కూటమి ఘన విజయంతో రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, టిడిపి నాయకులు దువ్వూరు కృష్ణారెడ్డి, వినయ్ రెడ్డి, పచ్చ వెంకటేష్ నాయుడు, ప్రవీణ్ కుమార్ రెడ్డి పుడిపత్రి ప్రవీణ్ కుమార్ రెడ్డి, గుండాల శ్రీనివాసులు , మేకల కుమార్, మూగశంకరయ్య, మేఘనూరు వెంకటకృష్ణయ్య, కోట సతీష్ యాదవ్, ఎన్. చంద్రశేఖర్, కోటేశ్వర రాజు, కీరవాణి తదితరులు పాల్గొన్నారు.

## చేయూత చిన్నపిల్లల ఆశ్రమంలో అన్నదానం

**నాయుడుపేట, జూన్ 12 ప్రభాతవార్త**

నాయుడుపేట పట్టణంలోని చేయూత చిన్నపిల్లల అనాధశ్రమంలో బుధవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఎన్డీఏ కూటమి అత్యధిక మెజారిటీ సాధించి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా చిట్టమూరు మండలం చిల్లమూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు అరిగెల నాగార్జున తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని విద్యార్థులకు స్కూల్ కిట్, పుస్తకాలు, పెన్నులు, జామెంట్రీ బాక్స్, స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి.దిలీప్‌కుమార్, అరిగెల భవాని, సంయుక్త, శ్రీవల్లి, ఆశ్రమం నిర్వాహకులు తొప్పాని కృష్ణయ్య, సిహెచ్ జాన్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

## వాకాడులో టిడిపి నాయకుల సంబరాలు

**వాకాడు, జూన్ 12, ప్రభాతవార్త**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వాకాడులోని తెలుగుదేశం పార్టీ నాయకులు భారీ స్థాయిలో సంబరాలు జరుపుకున్నారు. బుధవారం మండల కేంద్రమైన వాకాడులోని అశోక పిల్లర్ సెంటర్ సమీపంలో కేక్‌ని కట్ చేసి లడ్లు, కేకును అందరికీ పంచిపెట్టారు. దాదాపు రెండు గంటలు సేపు బాణ సంచాలు పేల్చారు. అశోక పిల్ల సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు టిడిపి జిందాబాద్ అంటూ చేస్తూ వచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపిడీవో వెంకటేశ్వరావు ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం వీడియో లైవ్‌లో ఏర్పాటు చేశారు. అధికారులు ప్రజాప్రతినిధులు తిలకించారు. ఈ సందర్భంగా మధు రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ చరిత్ర తిరగ రాసిందని, వైకాపా అడ్రస్ గల్లంతయిందన్నారు. ఈ సంబరాల్లో సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, ప్రసాద్ రెడ్డి, ద్వారకానాథ్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, కృష్ణమూర్తి, మండల జనసేన అధ్యక్షుడు శివకుమార్, బిజెపి మండల అధ్యక్షుడు వల్లి ప్రసాద్, నెల్లూరు సుధాకర్ రెడ్డి, చరణ్ రెడ్డి, అన్నమేటి చంద్రయ్య, అరుణ్ కుమార్, గంగాధర్ రెడ్డి, అయోధ్య బాలచంద్రశెట్టి, ఎంబేటి పోలయ్య, కోట శ్రీనివాసులు, హరీష్ నాయులు, నలగామాల గున్నయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని గ్రామాలలో టిడిపి శ్రేణులు కేకులు కట్ చేసి ఆనంద సంబరాలు జరుపుకున్నారు.

## చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

**నాయుడుపేట (పెళ్లకూరు), జూన్ 12 ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నాలుగోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పెళ్లకూరు మండల పరిషత్ కార్యాలయంలో పేరం బ్రదర్స్ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మొక్కలు నాటి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు, తెలుగుదేశం పార్టీ ప్రధాన కారనయదర్శి నాగేంద్రరెడ్డి, సీనియర్ నాయకులు పాపాడి రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి శ్రీనివాసులునాయుడు, కాటూరు గోపాలరెడ్డి, రాధానాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, వేణురెడ్డి, కోట రమేష్, పైపురు వెంకటేశ్వర్లు, ఎన్ఆర్ఐ పేరం వెంకట్‌తేజ, సందీప్ తేజ పాల్గొన్నారు. అనంతరం పేరం సోదరులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రమాణస్వీకార ప్రత్యక్ష ప్రసారాలు

**కుప్పంరూరల్, జూన్ 12 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వీక్షించారు. స్థానిక రెవెన్యూ, మండల కార్యాలయాల్లో ఎల్ఇడి తెర, ప్రొజెక్టర్ సాయంతో ప్రమాణస్వీకార వేడుకలను ప్రత్యక్ష ప్రసారం చేశారు. దీంతో రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు, వీఆర్వోలు, కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు వీక్షించారు. అలాగే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండులోసైతం ఎల్ఇడి తెర ఏర్పాటుచేయగా ప్రజలు తిలకించారు.కార్యక్రమాల్లో తహశీల్దార్ హరికుమార్, అర్బన్ సిఐ రమణ, ఎస్సై సుబ్బారెడ్డి, కమీషనర్ నాగేశ్వరరావు, ఎంపిడిఓ ఖాదర్‌బాషా, ఇఒపిఆర్‌డి విజయ్‌దత్ పాల్గొన్నారు. రామకుప్పం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారోత్సవాన్ని మండల కార్యాలయ ఆవరణలో అధికారులు ప్రత్యక్ష ప్రసారాతో తిలకించారు. కార్యాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పెద్ద సంఖ్యలో వివిధ శాఖల అధికారులు, ప్రజలు హాజరై ప్రమాణస్వీకారోత్సవ వేడుకలను తిలకించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్, ఎంపిడిఓ ఈశ్వరయ్య, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ పాల్గొన్నారు.

## ఘనంగా విజయం విద్యాసంస్థల ఆవిర్భావ వినోత్సవ వేడుకలు

**చిత్తూరురూరల్, జూన్ 12 ప్రభాతవార్త :**



చిత్తూరుపట్టణం, మిట్టూరులోని విజయం విద్యాసంస్థల రజోత్సవ(25వ) వ్యవస్థాపక వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు విజయం విద్యాసంస్థల అధినేత డా. ఎం.తేజోమూర్తి తెలిపారు. 2000వ సంవత్సరం జూన్ 12న కేవలం 10మంది విద్యార్థులతో విజయం కాంపిటిటివ్ సర్కిల్‌గా ప్రారంభమై నేడు స్కూల్(స్టేట్, సిబిఎస్ఇ) జూనియర్, డిగ్రీ, హోటల్ మేనేజ్‌మెంట్, బిజినెస్ స్కూల్( ఎంబిఏ, ఎంసిఏ) విభాగాలతో దాదాపు 6000 మందికి విద్యను అందిస్తూ జిల్లాలోనే కాక రాష్ట్రస్థాయిలో ఒక అత్యున్నత విద్యాసంస్థగా రూపుదిద్దుకొందన్నారు. వేలాదిమంది విద్యార్థులను ప్రభుత్వ, కార్పొరేట్ ఉద్యోగులుగా తీర్చిదిద్దుతోందన్నారు. విజయం డిగ్రీ కళాశాలకు నాక్ ఎ+ గ్రేడుతో జాతీయస్థాయిలో గుర్తింపు పొందడానికి తమ ప్రమాణాలు నిదర్శనమని, ఐఐటి, నీట్ కొరకు న్యూఢిల్లీకి చెందిన మై క్లాస్‌రూం సహకారంతో డా. విఐఐటి అనే నూతన విభాగాన్ని ప్రారంభిస్తున్నామని, వీటి ద్వారా చిత్తూరు పరిసర ప్రాంతపు విద్యార్థులకు ఐఐటిలు, వైద్యకళాశాలలలో ఎక్కువ సీట్లు సాధించడం ధ్యేయంగా పెట్టుకొన్నామన్నారు. అలాగే 2024-25 విద్యాసంవత్సరం నుంచి విద్యావ్యవస్థలో నూతన ఒరవడిని సృష్టిస్తూ విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయం ద స్కూల్ ప్రిన్సిపల్ డా.ఎం. శైలజామూర్తి, జూనియర్, డిగ్రీ, బిజినెస్ స్కూల్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## బంగారుపాళ్యం దళితవాడలో గంగజాతర

**బంగారుపాళ్యం, జూన్ 12 ప్రభాతవార్త :**

మండల కేంద్రం బంగారుపాళ్యం దళితవాడ నందు ఘనంగా గంగజాతర ఉత్సవాలు జరిగాయి. మంగళవారం గంగమ్మ దళితవాడ పురవీధుల్లో ఊరేగి బుధవారం తెల్లవారుజామున నడివీధిలో ప్రతిష్టించారు. అమ్మవారికి అంబలిపూజలు, దీపారాధన, జంతుబలులు, నైవేద్యం అందించారు. మాజీ జడ్పీచైర్మెన్ కుమారరాజ, సర్పంచు ఉమాదేవిక్రిష్ణమూర్తిలు గంగమ్మను దర్శించుకొన్నారు. రాత్రి భారీ ఎత్తున బాణాసంచా పేల్చుతూ గంగమ్మను జలప్రవేశం గావించారు. అలాగే తగ్గువారిపల్లి,సంక్రాంతిపల్లి, గుండ్లకట్టమంచి, మొగిలివెంకటగిరి దళితవాడ నందు గంగమ్మజాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

## తెలుగుదేశం నాయకులు సంబరాలు

**బంగారుపాళ్యం, జూన్ 12 ప్రభాతవార్త :**

రాష్ట్రంలో కూటమి విజయం సాధించి ముఖ్యమంత్రిగా నారాచంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసారు. బంగారుపాళ్యం నందు బుధవారం తెలుగుదేశం నాయకులు సంబరాలను జరుపుకొన్నారు. స్థానిక పాత రెవిన్యూ కార్యాలయం నుంచి ప్రభుత్వ జూనియర్‌కళాశాల వరకు రహదారిపై బాణాసంచా పేల్చుతూ చంద్రబాబు జిందాబాద్, జై తెలుగుదేశం అంటూ నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కార్యదర్శి జనార్ధన్‌గౌడ్, తగ్గువారిపల్లి ఉపసర్పంచు లోకనాధన్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార ప్రత్యక్ష ప్రసారవీక్షణ

తొట్టంబేడు, జూన్ 12 ప్రభాతవార్త



రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో బుధవారం మండలపరిషత్ కార్యాలయంలోని సమావేశమందిరంలో కొత్త ప్రభు త్వంలో సిఎంగా నారాచంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్‌లతో పాటు మరో 24మంది మంత్రులుగా ప్రమాణస్వీకార మహోత్సవాన్ని తొట్టంబేడు మండల సీనియర్ వైకాపా పార్టీ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు, మరియు ప్రజాప్రతినిధులు,ఎంపిడిఓ ఐజాక్ ప్రవీణ్‌లతో పాటు సిబ్బంది సూపరింటెండెంట్ మధుసూధన్, సీనియర్ అసిస్టెంట్ జనార్ధన్, జూనియర్ అసిస్టెంట్ మునిరత్నం, కంప్యూటర్ ఆపరేటర్ చిరంజీవిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని కొత్త ప్రభుత్వంలో నారాచంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లతో పాటు మరో 22మంది ప్రజాప్రతినిధులు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, కేంద్రమంత్రి అమిత్‌షా, ప్రత్యేక అతిధులుగా విచ్చేసిన చిరంజీవి, రజనీకాంత్ దంపతులు హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు,అధికారులు చివరి వరకు ప్రమాణస్వీకార మహోత్సవాన్ని వీక్షించడం గమనించదగ్గ విషయం.

## దుర్గాదేవి ఆశీస్సులతో రాష్ట్రంలో చంద్రోదయం

శ్రీకాళహస్తి, జూన్ 12 ప్రభాతవార్త



గడచిన ఐదు సంవత్సరాలుగా దుష్టశక్తుల కబంద హస్తాలలో నలిగిపోయిన తెలుగునే తలను కాపాడుకోవడానికి అలుపెరుగని పోరాటం చేసిన చంద్రబాబు మరియు పవన్‌కళ్యాణ్ అండగా నిలబడిన దుర్గాదేవి ఆశీస్సులతో రాష్ట్రంలో చంద్రోదయం అయ్యిందని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు పేర్కొన్నారు. గడచిన ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన ఎన్డీయే కూటమి తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న తెలుగుదేశంపార్టీ అధినేత నారాచంద్రబాబునాయుడు విజయవాడ సమీపంలో కేసరపల్లి అనే ప్రాంతం వద్ద దేశ, విదేశీ ప్రతినిధుల సమక్షంలో ఎన్డీయే మిత్రపక్షాలకు చెందిన నాయకులు మరియు కార్యకర్తల నడుమ ప్రమాణస్వీకార మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం రాష్ట్ర చరిత్రలో మరపురానిఘట్టమన్నారు. కాగా కనకదుర్గమ్మ అమ్మవారి సన్నిధి వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించి శ్రీకాళహస్తి నుంచి తీసుకువచ్చిన పాలకోవాను భక్తులకు పంచిపెట్టడం జరిగిందని రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి) తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భాస్కర్, మణి, కోటచంద్రశేఖర్, శివ, రాప్తాడు నియోజకవర్గ నాయకులు నాగరాజు, మరియు పలువురు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## బొల్లినేని ఆధ్వర్యంలో అన్నదానికి హజరైన బృందమ్మ, రిషితరెడ్డిలు

శ్రీకాళహస్తి, జూన్ 12 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకుడు స్థానిక బైపాస్‌రోడ్డులో ఉన్న ఆయన కార్యాలయం వద్ద ఏడాది నుంచి నిరుపేదలకు మధ్యాహ్నభోజనం అంది స్తున్నారు. తెలుగుదేశంపార్టీ అధికారం లోకి వచ్చి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, శ్రీకాళహస్తిలో బొజ్జలసుధీర్‌రెడ్డి అఖండ మెజారిటీతో గెలిచిన సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా బొజ్జలబృందమ్మ, బొజ్జలరిషితారెడ్డిలతో పాటు తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడులు విచ్చేసి నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా బొజ్జలబృందమ్మ, బొజ్జలరిషితారెడ్డిలు బొల్లినేని జగన్నాధనాయుడు దంపతులను అభినందించారు.

## వైభవంగా వేడాం గంగమ్మ జాతర

శ్రీకాళహస్తిరూరల్,జూన్ 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని పలు గ్రామాల్లో జాతర సంబరాలు చోటు చేసుకున్నాయి. వేసవి కాలంలో పంటలు చేతికొచ్చిన తరువాత గ్రామాల్లో గ్రామదేవతను కొలవటం అలవాటు.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి మండలంలోని వేడాం గ్రామంలో గంగమ్మ జాతరను అంగరంగవైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా ఇక్కడ పండగ వాతావరణం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి మండలంలోని దక్షిణకాళిమాత ఆలయానికి సమీపంలోని వేడాం గ్రామం అతి పెద్దది. స్వర్ణముఖి నదీ ఒడ్డున వెలసిన గ్రామంలో మూడు పంటలు పండించుటకుంటారు. సుమారు 500 గడపలు గల గ్రామంలో పండగలను వైభవంగా నిర్వహించుకోవటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో గంగమ్మ జాతరను భారీ ఎత్తున నిర్వహించారు. అలంకారాల్లోనూ, ముస్తాబుల్లో యువకులు చొరవ చూపారు.ఈ ఏడాది ఏర్పాట్లు, జాతర నిర్వహణను మనోహర్ సుధాకర్, నాదమునిల సారధ్యంలో వారి స్నేహితులు 15 మంది కలసి జాతరను నిర్వహించారు. గ్రామ పొలిమేరల్లోంచి అమ్మవారిని ప్రతిష్టించే చోటు వరకు చక్కగా విద్యుత్ దీపాల కాంతులతో దేదీప్యమానంగా అలంకరించారు. అమ్మవారిని చక్కగా అలంకరించారు. సప్పరాన్ని అద్భుతంగా కన్నులు మిరుమిట్లు కొల్పునట్లు ముస్తాబు చేసారు.అర్ధరాత్రి నుంచి ఉదయం 11 గంటల వరకు అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఇంటింటికి పొట్టేళ్ళను,మేకపోతులను అమ్మవారికి బలి ఇచ్చారు.మొక్కులు తీర్చుకున్నారు.మధ్యాహ్నం గ్రామం నిండా పట్టణానికి చెందిన యువకులు, స్నేహితులు,బంధువులు నిండిపోయారు.జాతర ప్రశాంతంగా జరిగింది. సాయంత్రం ఊరేగింపుగా అమ్మవారిని నిమజ్జనం నిర్వహించారు.

## నారా చంద్రబాబు,లోకేష్‌లను కలసిన ఎస్‌సివి

శ్రీకాళహస్తి,జూన్ 12 ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణం స్వీకారం చేసిన నారాచంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లను బుధవారం మాజీ శ్రీకాళహస్తి శాసన సభ్యుడు ఎస్‌సివి నాయుడు కలసి అభినందనలు తెలిపారు. ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఎస్‌సివి నాయుడు ఎన్నికల ముందు నారాచంద్ర బాబునాయుడు శ్రీకాళహస్తి,సత్యవేడు,సూళూరుపేట, వెంకటగిరిలలో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎస్‌సివిని ఆదేశించారు. పార్టీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని 'మీ భవిష్యత్తుకు నాది భరోసా' అంటూ చంద్రబాబునాయుడు ఎస్‌సివి నాయుడుకు భరోసా ఇచ్చారు.పార్టీ విజయానికి ఎస్ సివి నాయుడు తానే అభ్యర్థిగా పోటీ చేసినట్లు పరుగులు తీసారు. అభ్యర్థులను ప్రచార పరంగాను, ఆర్థికంగా ఆదుకొనుటకు చొరవ చూపారు.నాలుగు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించింది. చివరి మూడు రోజులు సత్యవేడు నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి గెలుపుకు ఎస్‌సివి నాయుడు పట్టుబట్టి క్యాడర్‌ను రంగంలో దింపారు. ఇక్కడ కూడా పార్టీ విజయం సాధించింది. ఈ అంశాలను చంద్రబాబు దృష్టికి రావటంతో ఆయన సంతోషం వ్యక్తం చేసారు. ఎస్‌సివి నాయుడును అభినందించారు. కాగా యువకుడైన నారా లోకేష్‌ను కలసి అభినందించారు. ఆది నుంచి లోకేష్ ఎస్‌సివి నాయుడును పార్టీ విజయానికి పాటు పడాలని మంచి భవిష్యత్తు ఉంటుందని భరోసా ఇస్తూ వచ్చారు. ఆయనను కలసి అభినందించారు.

## వైసిపి అవినీతి కుంభకోణాలను వెలికి తీస్తాం

తిరుపతి హెల్త్, జూన్ 12, ప్రభాతవార్త

వైసిపి పాలనలో జరిగిన ఎంపి, కార్పొరేషన్, తిరుపతి కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ తదితర తప్పుడు అవినీతి ఎలక్షన్‌ల పై పూర్తి విచారణ జరిపి సంబంధిత వారిపై అలాగే ప్రభుత్వ డిపార్ట్మెంట్లలో జరిగిన దోపిడి అక్రమాలపై కూడా చర్యలు తీసుకుంటామని, తెలుగుదేశం పార్టీ ప్రముఖ నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి వెల్లడించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బుధవారం మీడియా ముందు టిడిపి నాయకులు సిద్ధారెడ్డి, విజయ్, భాస్కర్, రవి, శంకర్ రెడ్డి, షణ్ముగం వాసు తదితరులతో కలిసి మబ్బు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు అవినీతిని ప్రోత్సహించడని తెలియజేశారు. చివరికి టిడిపి వారైనా తప్పు చేస్తే వదలడన్నారు. తిరుపతి నందు వైసిపిలో కొనసాగిన తమ బంధువులైనా తప్పు చేసి ఉంటే వదిలిపెట్టే ప్రసక్తిలేదని స్పష్టం చేశారు. తిరుపతిలోని వారికి వెంకన్న భక్తులే దేవుళ్ళని తెలియజేశారు. ఎందుకంటే భక్తులు కొండకు రానిదే, వెంకన్న లేడని, కావున భక్తులే తిరుమల తిరుపతి వాసులకు దేవుళ్ళన్నారు. తద్వారా తిరుపతి ప్రజలు ఆర్థికంగా, జీవిస్తున్నారని వివరించారు. తిరుమల శ్రీ వారి సొమ్మును తిన్న ఎవరైనా వెంకన్న ఆగ్రహానికి బలికాక తప్పదన్నారు. స్వామి సొమ్మును తిన్న ఎందరో పతనమవ్వడం తాను చూసానన్నారు. అమరావతిలో ప్రమాణ స్వీకరాం చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.

## సీఎం ప్రమాణ స్వీకారోత్సవాన్ని తిలకించిన ప్రజలు

సత్యవేడు, జూన్ 12 ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రిగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునా యుడు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజలు తిలకించారు. చంద్రబాబు చేత గవర్నర్ ప్రమాణం చేయించారు. పవన్‌కళ్యాణ్ తదితర రాష్ట్ర మంత్రులు కూడా పదవి ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రజలు, డ్వాక్రా సంఘం మహిళలు, అధికారులు తిలకించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ శివయ్య, జూనియర్ అసిస్టెంట్ అయ్యప్ప, వీఆర్వో ఇళయరాజా, వైఎస్ఆర్ క్రాంతిపదంసీసీపయని పాల్గొన్నారు.

## సంబరాలు జరుపుకున్న నగరి పట్టణ తెలుగు తమ్ముళ్లు

నగరి, జూన్ 12 ప్రభాతవార్త:

నగరి మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు మాన్యశ్రీ చంద్రబాబునాయుడు నాలుగో పర్యాయంగా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం సందర్భంగా నగరి శాసన సభ్యులుగా గాలి భానుప్రకాష్‌ని జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో గెలిపించిన నగరి ప్రజల కృతజ్ఞత పర్వంగా నేత్ర ప్రధాతగా ప్రసిద్ధి గాంచిన గ్రామదేవత నగరి శ్రీ దేశమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే నగరి టవర్‌క్లాక్ వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి గజమాల వేసి బాణసంచాలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. పది కేజీల లడ్డు అల్పాహారం పంచి సంబరాలు చేసుకున్నారు. నగరి మున్సిపల్ కార్యాలయం ఎదుట బాణసంచా కాల్చి కార్యాలయం సిబ్బంది అందరికి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో పట్టణ ముఖ్య నాయకులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

### రియల్టర్ చిన్నతంబు గోపికృష్ణ

చంద్రగిరి, జూన్ 12 ప్రభాతవార్త:



టిడిపిజాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించగలదని ప్రముఖ రియల్టర్ చిన్నతంబు గోపికృష్ణ అన్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని బుధవారం బాలాజీ నగర్‌లోని తన నివాసంతో టిడిపి శ్రేణులతో కలసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 5 ఏళ్ళలో రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ నిర్వీర్యమైనట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన చంద్రబాబు నాయకత్వంలో వ్యవస్థలన్నీ జీవంపోసుకోగలవన్నారు. చంద్రగిరి అభివృద్ధిలో ఎంఎల్ఏ పులివర్తి నాని తనదైన మార్కును సాధించగలరని విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేష్ చంద్రగిరి అభివృద్ధికి కట్టుబడి వున్నట్లు ఇదివరకే పలుమార్లు పులివర్తికి స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నతంబు లక్ష్మి, భావన చిన్నతంబు, చిన్నతంబు దరహాస్, టిడిపి నాయకులు పులికంటి మోహన్ రెడ్డి, ఉమాపతి రెడ్డి, బొంధు మహేష్ రెడ్డి, చెరుకూరి శేఖర్, సుబ్రమణ్యం యాదవ్, బాలకిషోర్, సి.మోహన్ రెడ్డి, అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమిట్టగంగమ్మకు బైరాగి వేషధారణలతో మొక్కులు

### ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి, జూన్ 12 ప్రభాతవార్త:

బైరాగి వేషధారణలతో భక్తులు శ్రీ మిట్టగంగమ్మ వారికి మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. చంద్రగిరిలోని శ్రీ మిట్టగంగమ్మ వారి జాతర వేడుకలు అంగరంగ వైభవంగా జాతర వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండవ రోజు బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు సుబ్బు స్వామి, అలంకరణ నిర్వహకులు ఉగ్రాణం సుబ్రమణ్యం రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉదదయ అమ్మవారికి అభిషేకం జరిపించారు. తదుపరి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఆలయ చైర్మన్ భక్తులకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పించడంతో పాటు అమ్మవారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

## చంద్రబాబు విజయంతో చెంగాళ్ళమ్మకు మొక్కులు

### నరశింగాపురం నుండి బయలుదేరిన 60 మంది

చంద్రగిరి, జూన్ 12 ప్రభాతవార్త:



టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్ర బాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న వేళ సూళ్ళూరుపేటలో వెలసియున్న శ్రీచెంగాళమ్మకు మొక్కులు తీర్చుకున్నట్లు రిటైర్డ్ రైల్వే యంప్లాయ్, టిడిపి నాయకుడు కన్నయ్య యాదవ్ తెలిపారు. బుధవారం నరశింగాపురంలో ఆయన టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలసి కేక్ కట్‌చేసి, భాణాసంచా సంబరా లు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరశింగాపురంకు చెందిన 60 మంది మహిళలను అమ్మవారి దర్శనానికి తీసుకెళ్ళి దర్శనం చేయించినట్లు తెలిపారు. అమ్మవారి దర్శనానంతరం టిడిపి సీనియర్ నాయకుడు శివకోటిరెడ్డి చేతులమీదుగా మహిళలకు పసుపు కుంకుమ, రవికె, అమ్మవారి తీర్థప్రసాదాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డిబాబు, మహిళలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బోండా ఉమాకు పాఠకం శుభాకాంక్షలు

తిరుపతి,జూన్ 12ప్రభాతవార్త:



ఎన్నికల్లో కూటమి పార్టీల తరపున విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యేగా గెలిచిన బోండా ఉమాను తిరుపతికి చెందిన టిడిపి నేత పాఠకం వెంకటేశ్ కలిశారు. బుధవారం ఉదయం ఉమాను కలసి దుశ్శాలువతో సన్మానించి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు.

## ప్రమాణ స్వీకారోత్సవానికి కదలి వచ్చిన మహిళలు,నాయకులు

శ్రీకాళహస్తి,జూన్ 12 ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారాచంద్ర బాబునాయుడు,ఆయన మంత్రి వర్గం ప్రమాణస్వీకారాన్ని తిలకించ టానికి వాడ వాడల్లో ఎల్ఇడి డిస్ప్లేలు ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తి ఆర్‌డిఓ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు పలు చోట్ల తిలకించటానికి ఏర్పాట్లు చేసారు.పానగల్‌లోని ఎన్‌టిఆర్ పార్కు వద్ద పెద్ద పెద్ద టివిలు ఏర్పాటు చేసారు.అలాగే పట్టణ నడిబొడ్డులోని బాబూ అగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. పానగల్, పరిసరాల్లోని ప్రజలు ఎన్‌టిఆర్ పార్కు వద్దకు చేరుకున్నారు. ఇక పట్టణ నడిబొడ్డులోని బాబూ అగ్రహారం పాఠశాలలో పట్టణానికి చెందిన ప్రజలు హాజరయ్యారు.ఈ సందర్భంగా భారీ ఎత్తున ఫ్లేక్సీలు వెలిసినాయి.ఏర్పాట్లను శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు పర్యవేక్షణలో పర్యవేక్షించారు.ప్రజలుఎదురు చూస్తున్న ప్రభుత్వం ప్రమాణ స్వీకారాన్ని కమిషనర్ ఓ పండగ వాతావరణంను సృష్టించారు. పానగల్ రోడ్డంతా జనం, వాహనాలతో నిండిపోయింది.అతిధులు బొజ్జల బృందమ్మను పూల బొకే ఇచ్చి స్వాగతించగా రిషితారెడ్డికి పూల కుండిని అందించారు.నిత్యం ప్రశాంతంగా పచ్చగా ఉండాలని అందించారు.పమాణ స్వీకారోత్సవంను శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ, సతీమణి బొజ్జల రిషితారెడ్డి, తాటిపర్తి ఈశ్వరరెడ్డి,రావిళ్ళమునిరాజానాయుడు, మాజీకౌన్సిలర్ బషీర్, మాజీ టౌన్‌బ్యాంకు ఉపాధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా,పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు,బి.రేణుకాదేవి,జగన్నాధం నాయుడుల సారధ్యంలో సాగింది.మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు,శ్రీనివాసులు,నారాయణరెడ్డిలు పర్యవేక్షించారు.సుమారు ఒకటిన్నర గంటల పాటు కార్యక్రమాలను మహిళలు కదలకుండా వీక్షించారు.

## బోధనకు ఆటంకంగా మారిన యాప్‌ల భారాన్ని తగ్గించాలి

తిరుపతి విద్య, జూన్ 12, ప్రభాతవార్త



ఎన్డీయే కూటమి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినందుకు నూతన ముఖ్యమంత్రికి మంత్రి వర్గానికి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) తరపున రాష్ట్ర అధ్యక్షులు శవన్న గారి బాలాజీ శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక న్యూ ఇందిరా నగర్‌లోని ఆపస్ జిల్లా కార్యాలయంలో బాలాజీ మాట్లాడుతూ 2024 - 25 విద్యా సంవత్సరం రేపటితో ప్రారంభమవు తున్న దృష్ట్యా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యయులకు, విద్యార్థులకు ఆపస్ తరపున స్వాగత శుభాకాంక్షలు తెలియజేసారు. అదే విధంగా కొత్త ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సినటువంటి బకాయిలను విడుదల చేయాలని, జీవో నెంబర్ 117ను రద్దు చేసి పాఠశాలల పరిరక్షణకు ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు నడుం బిగించాలని తద్వారా ఏర్పడినటువంటి ఉపాధ్యాయ ఖాళీలను మెగా డిఎస్సిలో పొందుపరిచి నిరుద్యోగులను ఆదుకోవాలని కోరారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్గుతుంది

### బొజ్జల రిషితారెడ్డి

శ్రీకాళహస్తి,జూన్ 12 ప్రభాతవార్త



ప్రజాతీర్పుతో ఆంధ్ర రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయని బొజ్జల రిషితారెడ్డి అన్నారు.బుధవారం నూతన మంత్రి వర్గ ప్రమాణ స్వీకారాన్ని తిలకించుటకు ఆర్‌డిఓ ఆదేశాల మేరకు ఎన్‌టిఆర్ పార్కు ఎదురుగా అలాగే పట్టణ నడిబొడ్డులోని బాబూ అగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వీక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోవు ఐదు సంవత్సరాల్లో ఖయిలా పద్ద ఆంధ్రప్రదేశ్‌ను నవ్యాంధ్రగా తీర్చి దిద్దటమే కాకుండా అమరావతిని అనుకున్న ప్రకారమే అబివృద్ధి చేస్తారన్నారు. నారాచంద్రబాబునాయుడు నాల్గవ సారి చంద్రబాబునాయుడుకు పట్టం కట్టారంటే ఆయనపై జనంలో గల నమ్మకానికి నిదర్శనం అని అమె అన్నారు.తెలంగాణలో ఎలాగైతే హైదరాబాదును అభివృద్ధి చేసారో అలాగే అంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారనే నమ్మకం జనాల్లో ఉందన్నారు.ఈ సమావేశంలో శ్రీకాళహస్తి కోఆపరేటివ్ పాలసరఫరా సంఘం అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు, మాజీ టౌన్‌బ్యాంకు ఉపాధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా,సుధాకర్,తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి,రవీంద్రరెడ్డి,మాజీ కౌన్సిలర్లు బషీర్ తదితరులు పాల్గొన్నారు.

## పౌరవిమానశాఖ మంత్రిని కలసిన రంగినేని:

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 12 ప్రభాతవార్త



కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజర్ల రామమోహన్ నాయుడుకు శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి మాజీ అధ్యక్షుడు, జిల్లా తెలుగుదేశం అధికార ప్రతినిధి రంగినేని చెంచయ్య నాయుడు కలసి అభినందించారు.ఆయనకు పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను అందించారు.కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వంలో యువకుడైన రామమోహన్‌నాయుడుకు శ్రీకాళహస్తి వాసులతో తెలుగుదేశం కుటుంబసభ్యులతో సన్నిహితత్వం ఉంది. దాంతో శ్రీకాళహస్తికి చెందిన యువకులు కేంద్ర రాష్ట్ర మంత్రులను కలసి జ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను అందిస్తున్నారు.

# తిరుపతి డివిజన్

## చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

### గంజి మాధవయ్య

పుత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త :



ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు నాల్గో సారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బుధవారం తెలుగుదేశం పార్టీ రూరల్ క్లస్టర్ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంపిపి గంజి మాధవయ్య నేతృత్వంలో మండలంలోని తడుకు పంచాయతీ మజ్జిగ గుంట వద్ద సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని చంద్రబాబునాయుడు ప్రగతి పథంలో నడిపిస్తారని తెలిపారు. టిడిపి పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. నగరిలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, ఆటో బాబు, మురళి, శివయ్య, రమేష్, బాలకృష్ణ, కమలమ్మ, నాగరాజ, మురగేష్. నవీన్, కొల్హాపురి, ఆదెయ్య, అమర్‌నాథ్, దేవరాజ్, రవి, రాజేష్, హరి, రామ్మూర్తి, రవి, పుండరీకాక్షయ్య, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ రికార్డు సృష్టించిన జనసేన

పుత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త :

జనసేన అధినేత పవన్ కల్యాణ్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంద ర్భంగా జనసేన పుత్తూరు



పట్టణ ప్రధాన కార్యదర్శి కె.రమేష్‌బాబు బుధవారం స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఎన్నికల్లో జన సేన పార్టీ సునామీలా విజృంభించి కూటమికి అఖండ విజయం సాధించి పెట్టిందని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ ప్రపంచంలో పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ ఏ పార్టీ గెలవలేదని, మొదటిసారిగా పోటీ చేసిన మొత్తం 21 స్థానాల్లోనూ గెలిచి ప్రపంచ చరిత్రలో ఏ పార్టీకి లేని వంద శాతం స్ట్రయిక్ రేట్‌తో రికార్డు సృష్టించిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాబు, శేఖర్, అరుణ్, రాధ పాల్గొన్నారు.

## చంబ్రాబునాయుడు సిఎంగా ప్రమాణస్వీకారంతో హర్షం

నింద్ర, జూన్ 12 ప్రభాతవార్త :



రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాల్గొవ సారి నారా చంద్రబాబునాయుడు బుధవారం అమరావతిలో పదవీ స్వీకారం చేయడంతో మండలం లోని టిడిపి నాయకులు, కార్య కర్తలు,అబిమా నులు హర్షం వ్యక్తం చేసారు.ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ చేయడంతో రాష్ట్రం అన్ని విధాలుగా అబివృద్ధి జరుగుతుందని తెలిపారు.మండలంలో టిడిపి అభిమానులు టపాకాయిలు పేల్చి,స్వీట్స్ పంచుకున్నారు. కార్యక్రమంలో మాజీ టిడిపి అధ్యక్షులు వెంకటేశ్వర్లు చౌదరి,నాయకులు రవినాయుడు,భాస్కర్,పరదేశి,క్రిష్ణయ్య, తంగవేలురెడ్డి,ఏబు, చక్రపాణి నాయుడు,ధనంజేయులునాయుడు,తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్న ప్రమాణస్వీకారం...వెంకటపతినగర్‌లో అన్నదానం

### -నాలుగు బూత్‌లలోను టిడిపి మెజార్టీ సాధించాం: ఉసిరిపాటి శ్రీనివాస్

తిరుపతిరూరల్, జూన్ 12 ప్రభాతవార్త:



రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకార మహోత్సవాన్ని పుస్కరించుకుని బుధవారం వెంకటపతి నగర్‌లో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వెంకటపతినగర్ టిడిపి అధ్యక్షుడు ఉసిరిపాటి శ్రీనివాసులు ఆధ్వర్యం లో ఉదయం పెద్దకేక్ కట్ చేసి సంబరాలు చేసుకోవడంతో పాటు మధ్యాహ్నం గ్రామ పంచాయతి ప్రజలందరికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వెంకటపతినగర్ వైకాపాకు కంచుకోటగా ఉండేదని, ఈ సార్వత్రిక ఎన్నికలలో కంచుకోటను బద్దలు కొట్టి, ఉన్న నాలుగు బూత్‌లలోను టిడిపి మెజార్టీ సాధించి, చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నానిని అఖండ మెజార్టీతో గెలిపించుకోవడం జరిగిందని శ్రీనివాసులు తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గెలుపుకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు, ఓటర్లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.యం.శ్రీనివాసులు, పాండు, నాగేశ్వరరావు, దొరబాబు, దొరస్వామినాయుడు, పెంచలయ్య, మురళిరెడ్డి, చరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మలగుంటలో తెలుగు తమ్ముళ్లు సంబరాలు

తిరుపతిరూరల్, జూన్ 12 ప్రభాతవార్త:



రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్ర బాబునాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా బుధవారం తుమ్మల గుంటలో తెలుగు తమ్ముళ్లు సంబ రాలు చేసుకున్నారు. టిడిపి రాష్ట్ర కార్యానిర్వాహక కార్యదర్శి బిరుదాల భాస్కర్‌రెడ్డి, ప్రచార కార్యధర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున బాణా సంచాలు పేల్చి, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. తమ ప్రియతమ నేత సి.యం. కావడంపై ఆనందాలతో హర్షం వెలబుచ్చారు. రాష్ట్ర ప్రజలకు మంచిరోజులు వచ్చాయని ఆనందపడ్డారు. ఎద్దఎత్తున టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

## "నారా చంద్రబాబు నాయుడు అనే నేను"

### అట్టహాసంగా తెలుగు తమ్ముళ్ళ సంబరాలు

చంద్రగిరి, జూన్ 12 ప్రభాతవార్త:



"నారా చంద్రబాబు నాయుడు అనే నేను" అంటూ ప్రమాణం చేయడం మొదలుపెట్టగానే పెల్లుబికిన ఉత్సాహంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు భాణాసంఛా పేళుళ్ళతో హోరెత్తించారు. 5 ఏళ్ళ వైసిపి పాలనకు చరమగీతం పాడి భారీ మెజారిటీతో విజయ ధుంధుభీ మోగించిన ఎన్‌డిఏ కూటమి బుధవారం చంద్రబాబు ఆధ్వర్యంలో మంత్రి వర్గం ప్రమాణ స్వీకారం చేసింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో తెలుగుతమ్ముళ్ళలో జోష్ పెరిగింది. తమ అభిమాన నాయకుడి ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని టిడిపి శ్రేణులు శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం నుండి బ్యాండుబాజాలతో టిడిపి శ్రేణులు కోలాహలంగా చిందులేస్తూ టవర్ క్లాక్ వద్దకు చేరుకున్నారు. రంగుల హోలీ జరుపుకుంటూ శుభాకాంక్షలు, జిందాబాద్‌ల నడుమ భాణాసంఛా పేళుళ్ళతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సక్కుర్ ధనంజయ రెడ్డి, తెలుగుయువత మండల అధ్యక్షుడు వినోద్‌కుమార్ రెడ్డి, మహేష్ రెడ్డి, లీలాకృష్ణ, రవి, మురళి, యల్లయ్య, నవీన్, లోకనాధరెడ్డి, కిషోర్, బాబి, నాగరాజ, మునీశ్వర్, సాయి, శ్రీను, పృధ్వీ, సాగర్, రెడ్డితేజ, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబుకి ఆత్మీయ స్వాగతం





రేణిగుంట, జూన్ 12 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసి తొలిసారి శ్రీవారి దర్శనానికి ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. చంద్రబాబు నాయుడుతో పాటుగా ఆయన కుమారుడు నారా లోకేష్, సతీమణి నారా భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి, మనువడు దేవాన్ష్ వచ్చారు. వీరికి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎండోమెంట్స్ కరికాల వలనన్, డిఐజీ షిమోషి, తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు ప్రవీణ్ కుమార్, షన్మోహన్, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, టిడిపి నాయకులు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిటిడి జెఇఒ గౌతమి, కమిషనర్ అతిధిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, రేణిగుంట మండలనాయకులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎంజిరెడ్డి, చిన్నారెడ్డి, తేజ మరియు అభిమానులు స్వాగతం పలికారు.

## జాతీయ మానవ హక్కుల సౌత్‌జోన్ ఛైర్మన్‌గా శ్రీధర్‌రావు

సూళ్లూరుపేట, జూన్ 12 ప్రభాతవార్త : సూళ్లూరుపేటకు చెందిన భీమన శ్రీధర్‌రావు జాతీయ మానవ హక్కుల, సామాజిక న్యాయ కమిషన్ దక్షిణ భారతదేశ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించి ఆ సంస్థ అధ్యక్షులు డాక్టర్ మెహతబ్‌రాయ్ నుంచి శ్రీధర్‌రావుకు సమాచారం అందింది. సామాజికపరంగా సమస్యలను సంస్థ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించే బాధ్యతలు చేపట్టాలని మెహతబ్‌రాయి తన ఆదేశాలలో సూచించారు. భీమన శ్రీధర్‌రావు గతంలో మానవ హక్కుల సంఘం రాష్ట్ర డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించి ఉన్నారు. తనకు లభించిన పదవి పట్ల బాధ్యతాయుతంగా పనిచేస్తానని శ్రీధర్‌రావు తెలిపారు.

## టి.వడ్డూరులో 34 మందికి అస్వస్థత

పలమనేరు, జూన్ 12, ప్రభాతవార్త: మండలంలోని టి.వడ్డూరు గ్రామంలో 34 మంది అస్వస్థతకు గురైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు...గ్రామంలోని ఓ ఇంటి శుభకార్యానికి గ్రామస్తులు హాజరై భోజనం చేయడం జరిగిందని అనంతరం అస్వస్థతకు 34 మంది గురికావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారని తెలిపారు. వైద్యులు వారికి వైద్య పరీక్షలు నిర్వహించి శుభకార్యంలో తిన్న భోజనం కారణంగా అనారోగ్యం చెందినట్లు ఎవరికి ప్రాణాపాయం లేదని తెలిపారు.

## కారు బోల్తా : గర్భిణి మృతి



బంగారుపాళ్యం, జూన్ 12 ప్రభాతవార్త: చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారి మొగిలి ఘాట్ వద్ద ఓ కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాలుగు మాసాల గర్భిణి మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్ళకు చెందిన ప్రతాప్ బెంగుళూరు నందు సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నాడు ప్రతాప్ భార్య సుధాశ్రీరాగ్ని (35) నాలుగు మాసాల గర్భిణీ. బెంగుళూరు నుండి కారులో వేలూరు సీఎంసీకి పరీక్షల నిమిత్తం మొగిలి ఘాట్ వద్ద కారు బోల్తా పడింది. కారులో ప్రయాణీస్తున్న సుధాశ్రీరాగ్ని అక్కడిక్కడే మృతిచెందింది. తల్లి రాగిని తీవ్రంగా గాయపడింది. బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్ష నిర్వహించి సీఐ లక్ష్మయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గంగమ్మకు సారె సమర్పించిన చెవిరెడ్డి



తిరుపతిరూరల్, జూన్ 12 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలంలో గంగజాతరను పురస్కరిం చుకుని మల్లంగుంట, పేరూరు గ్రామ పంచాయతీలలో కొలువుదీరిన గంగమ్మలకు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బుధవారం సారె సమర్పించారు. గంగ జాతరను తిరుప తిరూరల్ మండల ప్రజలు భక్తిశ్రద్దలతో జరుపుకుంటారని, గ్రామాలలో అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలని గ్రామ దేవత గంగమ్మను స్థానిక ప్రజలు వేడుకున్నారు.

## 135వ జాతీయ శతాధిక కవి సమ్మేళన బ్రోచర్ ఆవిష్కరణ



తిరుపతి హెల్త్, జూన్ 12, ప్రభాతవార్త : ఎస్వియు ప్రకాష్ భవనంలో బుధవారం 135వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంకు సంబంధించిన బ్రోచర్‌ను ఎస్వియు డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అండ్ కల్చర్ అఫైర్స్ డైరెక్టర్ ప్రో.మురళీధర్ ఎస్వియు కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపల్ జి. పద్మనాభం ప్రముఖ రచయిత్రి శ్రీశ్రీ కళా వేదిక రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి డా. ధనాసి ఉషారాణి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధనాసి ఉషారాణి మాట్లాడుతూ ఐఎస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక డా. కత్తిమండప్రతాప్ ఆధ్వర్యంలో డా. ధనాసి ఉషారాణి నిర్వహణలో తిరుపతిలో జూన్ 16 తేదిన ఎస్వీయూనివర్సిటీ డీ బ్లాక్ ఆడిటోరియం నందు డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ శ్రీశ్రీ కళా వేదిక సంయుక్త నిర్వహణలో తిరుపతి కవితోత్సవం పేరుతో జాతీయ శతాధిక కవి సమ్మేళనంను నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. అలాగే వివిధ పద్య ప్రక్రియలకు రూపకర్తగా అనేక పద్యములను రాయిస్తూ అనేక సాహితీ కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉన్న నేపథ్యంలో పద్య చంద్రిక పుస్తక ఆవిష్కరణను ప్రముఖులుగా విచ్చేయనున్న డా. కత్తిమండ ప్రతాప్ శ్రీ శ్రీ వేదిక అంతర్జాతీయ చైర్మన్, కన్వీనర్ కొల్లిరమావతి, ఈశ్వరీ భూషణం, హరిసర్వోత్తమ నాయుడు చిట్టెలలిత పార్థసారధి సంపత్ కుమార్ గుండాల రాకేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. పలువురు కవులు సుధాకర్, నిర్మల అవదాని మేడసాని మోహన్, సమాజ సేవకురాలు స్పెషల్ బ్రాంచ్ సుమతి, విసి కుసుమ కుమారి భూమన పలువురు మాజరుకానున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ కవి సమ్మేళనంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## సిఎం ప్రమాణ స్వీకార ప్రత్యక్ష ప్రసారాలు వీక్షించిన ప్రజలు



తిరుపతి కార్పొరేషన్, జూన్ 12, ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రిగా శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కచ్చపి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారాన్ని పెద్ద ఎత్తున ప్రజలు వీక్షించారు. నగర పాలక సంస్థ కమిషనర్ అధితి సింగ్ ఆదేశాల మేరకు కచ్చపి ఆడిటోరియంలో ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లను అధికారులు ఘనంగా ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు, పలువురు రాజకీయ నాయకులు కచ్చపి ఆడిటోరియంకు చేరుకున్నారు. ఆడిటోరియం నందు ఏర్పాటు చేసిన పెద్ద ఎల్ఈడి స్క్రీన్ మీద ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, మంత్రుల ప్రమాణస్వీకారాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాణ స్వీకారం వేళ గూడూరులో మిన్నంటిన సంబరాలు



గూడూరు, జూన్ 12, ప్రభాతవార్త : ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు మంత్రుల ప్రమాణ స్వీకారం సందర్భంగా గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద ప్రమాణ స్వీకారం కార్యక్రమం ప్రజలు తిలకించేందుకు ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేశారు. గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రజలు తిలకించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. పవన్ కళ్యాణ్ అభిమానుల కేరింతలతో సందడి వాతావరణం నెలకొంది. టిడిపి నాయకులు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిధిగా ప్రముఖ పారిశ్రామికవేత్త తానంకి నానాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం కిరణ్ కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రజల ఎంతో నమ్మకంతో టిడిపి పార్టీని గెలిపించారని పేర్కొన్నారు. గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా సునీల్ కుమార్‌ని ప్రజలు ఆశీర్వదించారని ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తానని వెల్లడించారు. అదే విధంగా నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం సందర్భంగా గూడూరు రెండో పట్టణ పరిధిలోని జిఎస్ రాయులు సెంటర్, మాలవ్యనగర్‌లోని వినాయకుని గుడి వద్ద టిడిపి నాయకులు బాణాసంచా కాల్చి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. అదే విధంగా గూడూరు పట్టణంలోని పురపాలక సంఘం ఆధ్వర్యంలో సిఆర్ కళ్యాణ మండపంలో సిఎం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రజలు తిలకించేందుకు ఎల్ఈడి స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ఎల్ఈడి స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి నాయకులు బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి, గుండాల భారతి, మునగపాటి సురేష్, గుండాల శ్రీనివాసులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నడివీధి చెంచమ్మకు సారె సమర్పించిన దొడ్ల



తిరుపతిరూరల్, జూన్ 12 ప్రభాతవార్త: తుమ్మలగుంట చెంచువారి కాలనీలో.... నడివీధి చెంచమ్మ జాతరను పురస్కరించుకుని బుధవారం టిడిపి నాయకులు దొడ్ల కరుణాకర్‌రెడ్డి సారె సమర్పించారు. అనంతరం దొడ్ల కరుణ చెంచమ్మకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం సందర్భంగా యాట పొంగల్ పెట్టి, మధ్యాహ్నం భక్తులందరికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తుమ్మలగుంట ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాటు, ఆయు:ఆరోగ్యాలతో ఉండాలని చెంచమ్మను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రత్నమ్మ, చెంగలరామానాయుడు, శ్రీనివాసులు రాయల్, రేవంత్, భాస్కర్‌రెడ్డి, సతీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పుంగనూరులో టిడిపి నేతల సంబరాలు



పుంగనూరు, జూన్ 12 ప్రభాతవార్త : ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు నాలుగవ సారి ప్రమాణ స్వీకారం చేసే కార్యక్రమం సందర్భంగా పుంగనూరు సంబరాలు నిర్వహించుకుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు మొత్తం సంబరాలలో మునిగి తేలారు. పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు సి.వెంకటరమణారెడ్డి, అధ్వర్యంలో ఉదయం నుంచి కోలాహలం మొదలయింది. పట్టణంలోని తూర్పు మొగసాల వద్దనుంచి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. వేలాది మందిగా పార్టీనాయకులు, కార్యకర్తలు అభిమానులు, మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ సరి క్లల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలవేసి సంబరాలు నిర్వహించారు. సమావేశంలో సివిరెడ్డి మాట్లాడుతూ రాష్టానికి మంచిరోజులు వచ్చాయని, పుంగనూరు నియోజకవర్గానికి కూడా చల్లా బాబు సార్యధ్యలో చంద్రబాబు అండగా నిలబడి అభివృద్ధి పనులు అందచేస్తారన్నారు. ఇంతకాలం పుంగనూరుకు పట్టిన శని విరగడైందని, ఇక ప్రజలు ఎవరికి భయపడకుండా జీవించాలన్నారు.

## కన్నుల పండువుగా శ్రీద్రౌపదీ కళ్యాణం



ఏర్పేడు, జూన్12, ప్రభాతవార్త; మండలంలోని పాతవీరాపురం గ్రామంలో శ్రీద్రౌపదీ సమేత శ్రీధర్మరాజస్వామి వారి 50వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీద్రౌపదీ కళ్యాణం కార్యక్రమాన్ని ఆలయ ఆర్చకులు కన్నుల పండువుగా నిర్వహించారు. ఈకార్యక్రమాలను తిలకించేందుకు గ్రామస్థులే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన ప్రజలు, సుదూర ప్రాంతాలకు చెందిన వారు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిదంగా రేపు అర్జునుడు తపస్సు మాను అదిరోహించే కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు పాల్గొంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసి సభ్యులు మునిరంగారెడ్డి, మాజీ ఎంపీటీసి సభ్యులు మునిరత్నంరెడ్డి, సర్పంచి మంజుల, ఆలయ పూజారి రవి, దొరస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానిని కలసిన వినూత



శ్రీకాళహస్తి, జూన్ 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోట బుధవారం గన్నవరం విమానాశ్రయంలో భారత ప్రధాని నరేంద్రమోడిజీని కలసినారు. ఆయన ప్రత్యేక విమానంలో రాగా ఆయనకు కోట వినూత కలసి అభివాదం చేసారు. ప్రధాని కూడా ప్రతి అభివాదం చేస్తూ చిరునవ్వుతో పలకరించారు. ఆమె పరిచయం చేసుకున్నారు. ప్రధానితో పాటు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు కూడా ఉన్నారు. శ్రీకాళహస్తికి చెందిన నాయకులు దేశ నాయకులతో ఇట్టే కలగలపుగా కలసి పోతున్నారు. శ్రీకాళహస్తి పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేస్తున్నారు.

## బంగారమ్మ గ్రామోత్సవం



శ్రీకాళహస్తి, జూన్ 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న బంగారమ్మ ఆలయంలో జాతర సందర్భంగా భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజుల నుంచి ఆలయంలో అంబళ్ళు నిర్వహిస్తున్నారు. కాగా బుధవారం మధ్యాహ్నం నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున చుట్టుపక్కల నివాసులు పొంగళ్ళు సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని చక్కగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వి నాగేశ్వరరావు దంపతులు, శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డిలు హాజరై, ఊరేగింపు జరిపారు. ఈ ఉత్సవంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు, లక్కమనేని మధు, సుధాకర్‌రెడ్డి, ఆలయాధికారులు మల్లికార్జున్ ప్రసాద్, సతీష్‌మాలిక్, లక్ష్మయ్య, మునిరెడ్డి మేకల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర మంత్రులను కలసిన సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి, జూన్ 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జలసుధీర్‌రెడ్డి విజయవాడకు చేరుకున్న కేంద్రపౌర విమానయానశాఖ మంత్రి కింజారపు అచ్చెమనాయుడు, మరియు రాష్ట్ర మంత్రి అచ్చెమనాయుడును మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించి శివయ్య స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ఈసందర్భంగా రాష్ట్రంలో ప్రజలు సుపరిపాలన అందిస్తారని వివరించారు.



## బాబురాకతో ఆంధ్రలో మళ్ళీ రామరాజ్యం

**-రాజంపేట సెగ్మెంట్ సుబ్రహ్మణ్యంరాజు**



పుంగనూరు, జూన్ 12 ప్రభాతవార్త : రాష్ట్రంలో మరోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయడంతో ఆంధ్రకు రామరాజ్యం సాధ్యమైందని రాజంపేట పార్లమెంటరీ సెగ్మెంట్ ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు అన్నారు. బుధవారం ఆయన సారథ్యంలో పశువుల పరుష జరుగుతున్న ప్రాంతంలో వేలాది మందికి అన్నదాన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ అయోధ్యలో మోదీ బాలరాముడిని ప్రతిష్టించగా, ఆంధ్రకు చంద్రబాబు రామరాజ్యాన్ని అందించేందుకు వచ్చారన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బిజెపి సహకారంతో ఆంధ్రలో మంచి పరిపాలన సాధ్యమౌతుందన్నారు. ఈసందర్భంగా మూడువేల మందికిపైగా రైతులకు ఆహారాన్నందించారు. సంతకు వచ్చి పశువులకు నీటి సదుపాయాన్ని కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రామకృష్ణమరాజు, హరిరాజు, జ్యోతిరాజు, జగదీశ్వరరాజు, మధు, సూరి, మహేష్, నాగ, భాస్కర, చంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.




## లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన లక్ష్మీపతిరాజు



పుత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ కేంద్రంలో వరుసగా మూడో సారి అధికారంలోకి వచ్చిన సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లాను పుత్తూరు రూరల్ మండలం తిరుమలకుప్పం రాజులకండ్రిగకు చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, వ్యాపారవేత్త అయిన జి.లక్ష్మీపతిరాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడి నేతృత్వంలో భారతదేశం అగ్ర రాజ్యాలతో సమానంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కొత్త ప్రభుత్వంలో రాష్ట్రానికి మూడు మంత్రి పదవులు ఇవ్వడం సంతోషదాయకమని పేర్కొన్నారు.

## చంద్రన్న ప్రమాణస్వీకారవేళ.. తెలుగుతమ్ముళ్ల ఆనంద హేల !!



కుప్పం, జూన్ 12 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసిన వేళ కుప్పంలో తెలుగుతమ్ముళ్లు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. స్థానిక బస్టాండు వద్ద పెద్ద ఎత్తున టపాకాయలు కాల్చారు. దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు చేశారు. జైబాబు..జైజై బాబు, చంద్రబాబునాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. నేతలు పిఎస్ సతీష్, బాలాజీ, రాజ్‌కుమార్, బాలాజీ, ఉమేర్, అస్లం పాల్గొన్నారు.

శాంతిపురం : మండల కేంద్రమైన శాంతిపురంలో తెదేపా నేతలు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. సిఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసినపుడు స్థానిక ఎన్టీఆర్ విగ్రహా:కు పూజలు చేశారు. అంతకుముందు స్థానిక గంగమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో నేతలు దేవరాజునాయుడు, రాజారెడ్డి, రాధాకృష్ణనాయుడు, రవి, నగేష్, గుండప్ప పాల్గొన్నారు.

